## క్లుప్తంగా

### వరద బాధితులకు సరుకుల పంపిణీ



వాహనంలో సరుకులను తరలిస్తున్న జీఈబీఏ సభ్యులు

పహాడీషరీఫ్: భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన మహబూబాబాద్, ఖమ్మం వరద బాధితులకు గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్(జీఈబీఏ) అండగా నిలిచింది. ఈ మేరకు శుక్రవారం 15 రకాల నిత్యవసరా సరకులతో కూడిన కిట్లను ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు వాసుదేవారెడ్డి మాట్లాడుతూ.. భారీ వర్షాలకు నష్టపోయిన వారికి మానవత్వంతో సాయం చేయాలని, తమ వంతుగా నిత్యవసరా వస్తువులను పంపిణీ చేసేందుకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు విక్రం, అక్షయ్, రాం రతన్, సుధీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ జాబితా ప్రదర్శన



ఓటరు జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచిన ఎంపీడీఓ సరిత తదితరులు

కందుకూరు: ఓటరు జాబితాలో ఏమైనా సమస్యలు ఉంటే ఈ నెల 21వ తేదీ వరకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత సూచించారు. శుక్రవారం వారు.. ఓటరు లిస్టును ఎంపీడీఓ, గ్రామ పంచాయతీల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి 28న తుది జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఉపాధ్యాయులకు సన్మానం



టీచర్లను సన్మానించిన లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

మీర్‌పేట: దీన్‌దయాల్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను శుక్రవారం జిల్లెలగూడ గీతాంజలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ ఫౌండర్, చైర్మన్ లయన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తరువాత పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే గురువులేనని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్‌యాదవ్, ఫాస్ట్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరి, ఉపాధ్యాయులు మంజుల, శశికళ, రూప తదితరులు పాల్గొన్నారు.

### అరెస్టులు అప్రజాస్వామికం



కందుకూరులో బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

కందుకూరు: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేపై దాడి చేసిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, అతని గుండాలను వదిలిపెట్టి, తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులందరిని ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ సురసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, పార్టీ నియోజకవర్గం సీనియర్ నాయకుడు కాకి దశరథ విమర్శించారు. శుక్రవారం వారితో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

### ప్రజాపాలనలో రక్షణ కరువు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో ప్రజలకు రక్షణ కరువైందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ ఆరోపించారు. ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి నిరసనగా.. శుక్రవారం ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి, 9 నెలలు గడిచినా వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. ప్రజల దృష్టి మరలించడానికి రేవంత్‌రెడ్డి.. పార్టీల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలపై దాడులు చేయించడంతో పాటు.. ప్రశ్నిస్తున్న వారిని అరెస్టు చేయిస్తున్నారని పేర్కొన్నారు.



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలో రాజే మిత్ర మండల్ అసోసియేషన్..



హుడాకాంప్లెక్స్: సీతా మెదోస్‌కాలనీలో లడ్డూతో..

## భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు

చవితి నవరాత్రుల్లో భాగంగా గణనాథుడికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఏడో రోజైన శుక్రవారం భక్తజనం మండపాల్లో కొలువై ఉన్న లంబోదరులకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేశారు. పలు ప్రాంతాల్లో ఉత్సవ నిర్వాహకులు నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివపుత్రుడి చేతిలోని లడ్డూను వేలం వేయగా.. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొని, మహాప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. అనంతరం డప్పుచప్పుళ్లతో విన్యాసాలు చేస్తూ యువత నృత్యాల నడుమ ఊరేగింపుగా వినాయకుడిని గంగమ్మ చెంతకు చేర్చారు. – సాక్షి, నెట్‌వర్క్



హుడాకాంప్లెక్స్: సున్నం చెరువులో నిమజ్జనానికి తరలిన భక్తులు



బడంగ్‌పేట: గణనాథున్ని దర్శించుకున్న కార్పొరేషన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి



బడంగ్‌పేట: బాలాపూర్ గణపతి సన్నిధిలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు



తుక్కుగూడ: బొడ్రాయి వద్ద గణపతికి పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

## పోరాట యోధుడు సీతారాం ఏచూరి

- పేదల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు
- అంచెలంచెలుగా జాతీయ స్థాయికి ఎదిగిన నేత
- పలువురు నాయకుల నివాళి



మీర్‌పేట: సీతారాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు



ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

మీర్‌పేట: దేశంలో అనేక కార్మిక, విద్యార్థి, రైతుల పోరాటాలకు నాయకత్వం వహించిన అపర మేధావి సీతారాం ఏచూరి అని సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి యాదయ్య అన్నారు. బడుగుబలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు అని కొనియాడారు. శుక్రవారం మీర్‌పేట చౌరస్తా, బాలాపూర్ చౌరస్తాలో సీతారాం చిత్ర పటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. జేఎన్‌యూలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన సీతారాం, పార్లమెంటులో సీపీఐ పక్షనాయకునిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై చర్చలు, ఉపన్యాసాలు చేశారని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు గౌరవించే ఆదర్శ మేధావిగా సీతారాం గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రాజలింగం, మీర్‌పేట శాఖ కార్యదర్శి ప్రకాశ్, యాదగిరి చారి, దాసరి బాబు, మల్లికార్జున్, మల్లేశ్, యాదయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

**కందుకూరులో..**

కందుకూరు: సీతారామ్ ఏచూరి మరణం సీపీఎం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్, మండల కార్యదర్శి బుడ్డీరపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, అంచెలంచెలుగా ఎదుగుతూ సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడిగా సుదీర్ఘకాలం పని చేశారని గుర్తుచేశారు. మూడు పర్యాయాలు అఖిల భారత ప్రధానకార్యదర్శిగా దేశానికి సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాల్‌రాజ్, కుమార్, చందు, నరసింహా, కృష్ణ, ప్రభాకర్, అంజయ్య, బాల్‌రాజ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడివేళల్లో బస్సు నడిపించండి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆర్టీసీ సిబ్బందికి ఉపాధ్యాయులు, విద్యార్థుల వినతి

కందుకూరు: పాఠశాలల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు తిప్పాలని మండల పరిధి మీర్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం బస్ కండక్టర్, డ్రైవర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో 230 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. గుమ్మడవెల్లి, ఆకులమైలారం, కొలన్‌గూడ, మాలగూడ గ్రామాల నుంచి అధికంగా బస్సుల్లో బడికి వస్తుంటారని చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల సమయాన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు మార్చిందని, ఆ సమయానికి సర్వీసును మార్చకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం డిపో అధికారులు స్పందించి, బస్సు సమయాన్ని మార్చి, విద్యార్థుల సమస్యను తీర్చాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్‌నగర్, ఆటోనగర్, బీరప్పటెంపుల్, ఆంధ్రకేసరినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు, 11కేవీ విశాలాంధ్రనగర్, విష్ణు థియేటర్, శారదానగర్, గణేశ్‌నగర్ ఫీడర్ల పరిధి ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు, 11కేవీ హనుమాన్‌నగర్ ఫీడర్ పరిధి కాలనీల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు, 11కేవీ న్యూనాగోలు, రాక్‌హిల్స్, హైకోర్టు, లక్ష్మీగణపతి ఫీడర్ల కింద మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## దేశ హితమే బీజేపీ ఎజెండా



మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణకు సభ్యత్వం అందజేస్తున్న పార్టీ నాయకులు

అందెల శ్రీరాములు యాదవ్

మీర్‌పేట: దేశ హితం కోసం పనిచేసే పార్టీ ఒక్క బీజేపీ మాత్రమేనని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం, సభ్యత్వ నమోదు మీర్‌పేట ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లెలగూడ పార్టీ క్వార్టర్స్‌లో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడారు. దేశంలోనే శక్తివంతమైన పార్టీ బీజేపీ అని, వికసిత్ భారత్‌లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని కమలనాథులకు సూచించారు. ఇటీవల రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ ప్రతిష్టతను దెబ్బతీసేలా ఉన్నాయని, వెంటనే ఆయన ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, భిక్షపతిచారి, హరినాథ్‌రెడ్డి, భీంరాజ్, నాయకులు గాజుల మధు, సోమేశ్వర్, బుచ్చిరాములు, విక్కీసాగర్, చింతల రాఘవేందర్, గడ్డం జగన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ బలోపేతానికి కృషి




షాబాద్: సభ్యత్వ నమోదును సతీష్‌రెడ్డికి అందజేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ

షాబాద్: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, కేఎస్ రత్నంలతో కలిసి పార్టీ సభ్య త్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికి తెలియజేసి పార్టీలో చేర్పించాలని సూచించారు. చేవెళ్లలో అత్యధికగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు. జిల్లా లోని మారుమూల గ్రామాల్లో సైతం సభ్యత్వం చేయించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ క్షేత్ర స్థాయిలో బలోపేతంగా తీర్చిదిద్దటానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాము, శ్రీధర్‌రెడ్డి, పీసరి సతీష్‌రెడ్డి, కూతురు మహేందర్, మురళీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, క్యామ నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, వినయ్, ప్రశాంత్, రాజు, సత్యం, శ్రీశైలం, నర్సింహులుగౌడ్,

మొయినాబాద్ రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు సనివెళ్లి ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కాశీంబౌలి గ్రామంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని ర్యాలీ చేపట్టారు. నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తూర్పు మాధవరెడ్డి పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌ది అరాచక పాలన



పహాడీషరీఫ్: ఎమ్మెల్యే సబితారెడ్డికి మద్దతు తెలుపుతున్న జల్‌పల్లి నాయకులు



పహాడీషరీఫ్: పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు



తుక్కుగూడ: బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

- ప్రతిపక్ష నేతలపై దాడులకు పాల్పడటం మంచిదికాదు
- అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు
- నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్న ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ నేతల మండిపాటు

హుడాకాంప్లెక్స్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలన కొనసాగుతుందని బీఆర్‌ఎస్ శ్రేణులు మండిపడ్డారు. పార్టీ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి, మాజీ మంత్రులు హరీశ్, సబితారెడ్డి, ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా.. పార్టీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాలకు వెళ్తున్న పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ డివిజన్, పార్టీ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియంత పాలన కొనసాగుతుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి నిరసన తెలిపే హక్కు ఉందన్నారు. ప్రజాపాలన ముసుగులో రౌడీయిజం నడుస్తుందనడానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను చూస్తుంటే అర్థమవుతోందని విమర్శించారు. ప్రతిపక్ష నేతలనే గౌరవం లేకుండా అక్రమ అరెస్టులకు పాల్పడటం సరైంది కాదని హితవు పలికారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

**బీఆర్‌ఎస్ ఆందోళన..**

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడికి నిరసనగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళనలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పహాడీషరీఫ్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలతో పాటు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన పలువురు నాయకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు.

**సబితకు మద్దతుగా..**

నిరసన కార్యక్రమానికి వెళ్తున్నారన్న సమాచారంతో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారన్న విషయం తెలుసుకున్న జల్‌పల్లి మున్సిపాలిటీ నాయకులు.. ఎమ్మెల్యేకు మద్దతుగా ఆమె నివాసానికి తరలి వెళ్లారు. సర్కార్ వైఖరిపై మండిపడ్డారు. వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ హామెద్, మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్, నాయకులు వాసుబాబు, సయ్యద్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

**అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు**

తుక్కుగూడ: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి, పార్టీ నేతల అరెస్టుకు నిరసనగా.. పార్టీ పిలుపు మేరకు ఆందోళన బాట పట్టిన గులాబీ శ్రేణులను పోలీసులు ముందసు అరెస్టు చేశారు. అనంతరం పహాడిషరీఫ్ ఠాణాకు తరలించారు.

### డ్రోన్లపై నిఘా పెట్టండి

యాచారం: రాత్రి పూట ఆకాశంలో చక్కర్లు కొడుతున్న డ్రోన్లపై నిఘా పెట్టి, నిగ్గుతెల్చాలని నక్కర్తమేడిపల్లి గ్రామస్తులు శుక్రవారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పలు గ్రామాల మీదుగా రాత్రి 10 గంటల తర్వాత డ్రోన్లు తిరగడంతో ప్రజల్లో భయాందోళన నెలకొందని, నాలుగైదు రోజులుగా చింతపట్ల, మొండిగౌరెల్లి, మాల్, యాచారం, మల్కీజ్‌గూడ, కొత్తపల్లి, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో గాల్లో డ్రోన్లు తిరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో గ్రామస్తుల్లో భయాందోళనలు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్కడి నుంచి అవి వస్తున్నాయి, ఎవరు వాటిని తిప్పుతున్నారో కనిపెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి

తహసీల్దార్ సైదులు



బీసీ హాస్టల్ వంటశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన రుచికరమైన భోజనం పెట్టాలని తహసీల్దార్ సైదులు పేర్కొన్నారు. శుక్రవారం మహేశ్వరం గేటు వద్ద బీసీ రెసిడెన్షియల్ హాస్టల్‌ను తహసీల్దార్ సందర్శించి వంటశాలలో భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలన్నారు. మెను ప్రకారం విద్యార్థులకు రుచికరమైన వంటలు వండాలన్నారు. ప్రతీ విద్యార్థి మధ్యాహ్న భోజనం, హాస్టల్లో వడ్డించే భోజనం తినాలని ఆయన సూచించారు.

### ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఆమనగల్లు: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కల్వకుర్తి కమ్యూనిటీ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.లింగయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఎంఆర్‌డీఎస్ 2 ఎన్‌జీఓ నిర్వాహకురాలు వాణి, పద్మతో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ హెచ్ఐవీ నాలుగు మార్గాల ద్వారా వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధి సోకిన వారితో శారీరకంగా కలవడం, హెచ్ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీలు వాడటం ద్వారా, హెచ్ఐవీతో కలుషితమైన రక్తాన్ని ఎక్కించడం వలన, వ్యాధి సోకిన తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తుందని వివరించారు. ఎవరికైనా అనుమానం ఉంటేరక్తపరీక్ష చేయించుకోవాలని సూచించారు.